ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3 తమిళనాడు TAMILNADU

ఆదివారం 1 సెప్టెంబరు 2024





రేస్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఉదయనిధి

రయ్.. రయ్...!

రోడ్లపై పరుగులు తీసిన రేస్ కార్లు ● చెన్నైలో ప్రారంభమైన 'ఫార్ములా-4' రేస్



రేస్‌కు సిద్ధంగా ఉన్న కార్లు

చెన్నై, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన 'రేస్' చెన్నైలో శనివారం సాయంత్రం ఆవిష్కృతమైంది. కలల్లో ఊహించుకున్న కార్లు కళ్లముందు పరుగిడుతుంటే.. యువత ఆనందానికి హద్దే లేకుండాపోయింది. తమ అభిమాన రేసర్లు తమ కళ్లముందే కదలాడుతుంటే వారి ఆనందం చెప్పనలవి కాకుండాపోయింది. రాష్ట్ర క్రీడాభివృద్ధి కమిషన్, ప్రైవేటు రేసింగ్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ 'ఫార్ములా-4 చెన్నై ఆన్ స్ట్రీట్ రేసింగ్ సర్క్యూట్ - నైట్ రేస్' శనివారం ప్రారంభమైంది. స్థానిక ఐల్యాండ్ గ్రౌండ్స్ నుంచి ప్రారంభమైన ఈ రేస్ యుద్ధ స్మారక స్థూపం, నేపియర్ వంతెన, స్వామి శివానంద రోడ్డు, అన్నాసాలై మీదుగా 3.5 కి.మీ దూరం మేరకు సాగింది. రేస్ ట్రాక్ 19 మలుపులు, హై స్పీడ్ స్ట్రెయిల్‌ను కలిగి వుంది. అభిమానులు, సందర్శకుల భద్రత దృష్ట్యా రేస్ జరిగే మార్గం ఇరువైపులా రేకులు, బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు.

ఆలస్యంగా రేస్..

ఈ రేస్‌ను నిషేధించాలని కోరుతూ బీజేపీ అధికార ప్రతినిధి ప్రసాద్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్ విచారించిన హైకోర్టు, ఫార్ములా-4 కార్ రేస్‌ను నిలిపేసేందుకు నిరాకరించింది. అదే సమయంలో కారు రేస్‌లను అనుమతించే అంతర్జాతీయ సంస్థ నుంచి ఎఫ్ఐఏ సర్టిఫికెట్ పొందాలని, రేస్ ప్రారంభానికి 12 గంటల ముందుగా ఈ సర్టిఫికెట్ పిటిషనర్‌కు అందించాలని ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో, రేస్ శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా, ఎఫ్ఐఏ సర్టిఫికెట్ సమర్పణకు అవకాశం కల్పించాలని రేసింగ్ ప్రమోషన్ సంస్థ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి, అత్యవసర కేసుగా విచారించాలని విజ్ఞప్తి చేసింది. రేస్ జరిగే మార్గాన్ని పరిశీలించిన ఎఫ్ఐఏ సంస్థ కొన్ని మార్పులు చేయాలని సూచించిందని, ఆ మార్పులు చేపట్టామని, నగరంలో శుక్రవారం కురిసిన వర్షాల కారణంగా పనుల్లో జాప్యం జరిగినందున సర్టిఫికెట్ సమర్పణకు సాయంత్రం 6 గంటల వరకు అవకాశం కల్పించాలని కోరింది. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తులు సురేష్‌కుమార్, బాలాజీతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. రేసింగ్ ప్రమోషన్స్ సంస్థ తరఫున, మరో 3-4 గంటల్లో ప్రాక్టీస్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయని, సాధారణంగా రేస్ ప్రారంభమయ్యే గంట, రెండు గంటల ముందుగా సర్టిఫికెట్ అందజేస్తారని తెలియజేసింది. అందుకు జోక్యం చేసుకున్న న్యాయమూర్తులు.. ఒక వేళ సర్టిఫికెట్ అందించేందుకు నిరాకరిస్తే, ఏం చేస్తారంటూ? ప్రశ్నించారు. అందుకు సంస్థ తరఫు న్యాయవాదులు ఒకవేళ సర్టిఫికెట్ లభించని పక్షంలో రేస్ వాయిదా వేస్తామని తెలిపారు. ఈ వివరణ పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తులు, ఎఫ్ఐఏ సర్టిఫికేట్ పొందేందుకు రాత్రి 8 గంటల వరకు అవకాశం కల్పించారు.

ట్రయల్ రన్...

ప్రాక్టీస్ మ్యాచ్‌లు ప్రారంభానికి ముందు రేస్ మార్గంలో చేపట్టిన మార్పులను పరిశీలించేందుకు సాయంత్రం 5.30 గంటలకు ఎఫ్ఐఏ నిర్వాహకులు ట్రయల్ రన్ నిర్వహించారు. అనంతరం తొలివిడత అనుమతులు అందజేసినట్లు రాష్ట్ర క్రీడాభివృద్ధి కమిషన్ తెలపడంతో పాటు రాత్రి 7 గంటలకు రేస్ ప్రారంభమవుతుందని ప్రకటించింది. స్థానిక ఐల్యాండ్ గ్రౌండ్స్‌లో 2027 వరకు ఎఫ్4 కారు రేస్ నిర్వహణకు ఎఫ్ఐఏ అనుమతించినట్లు ప్రకటించడంతో, రేస్‌లో పాల్గొన్న అంతర్జాతీయ క్రీడాకారులతో తొలుత ట్రయల్ రన్ నిర్వహించారు.

మంత్రి ఉదయనిధిచే ప్రారంభం..

ఫార్ములా-4 కారు రేస్ పోటీలను మంత్రి ఉదయనిధి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన వెంట ఎంపీ దయానిధి మారన్, మేయర్ ప్రియ సహా క్రీడాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ పోటీలు రాత్రి 11 గంటల వరకు సాగాయి. కాగా ఆదివారం కూడా పోటీలు జరుగుతాయి.



రేస్‌ను తిలకిస్తున్న మంత్రి

అభిమానుల కోలాహలం...

రాత్రివేళ సర్క్యూట్ రేస్ జరగడం దక్షిణాసియాలోనే ఇదే ప్రథమమని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలు వీక్షించేందుకు 8,000 సీట్లతో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆ టిక్కెట్లు హాట్ కేక్‌ల్లా విక్రయమయ్యాయి. అలాగే, నిర్ధిత ప్రదేశంలో ప్రజలు ఉచితంగా వీక్షించేందుకు అవకాశం కల్పించారు. ఈ రేస్ వీక్షించేందుకు పలు జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాలు, విదేశాల నుంచి కూడా అభిమానులు తరలివచ్చారు. మధ్యాహ్నం 12.30 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయనే తొలుత ప్రకటించడంతో మధ్యాహ్నానికే ఆ ప్రాంతానికి పెద్దసంఖ్యలో చేరుకున్నారు. రేస్ ఆలస్యం కావడంతో నిరాశచెందిన అభిమానులు, రాత్రి 7 గంటల వరకు నిరీక్షించారు. ఈ రేస్ పోటీల్లో భాగంగా అభిమానులకు మరింత వినోదం అందించేలా కార్లతో చేపట్టిన విన్యాసాలు అభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కాగా ఈ పోటీలను ఉచితంగా వీక్షించవచ్చని తొలుత నిర్వాహకులు ప్రకటించారు. దీంతో అభిమానులు పెద్దసంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. కానీ, ముందుగా వచ్చిన 500 మందిని మాత్రమే ఉచితంగా గ్యాలరీలలోకి అనుమతించడంతో మిగిలిన అభిమానులు నిరుత్సాహానికి గురయ్యారు.

రాష్ట్రంలో వారం రోజుల పాటు వర్షాలు

● వాతావరణ శాఖ హెచ్చరిక

అడయార్, ఆగస్టు 31: రాష్ట్రవ్యాప్తంగా వచ్చే వారం రోజులపాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. నైరుతి రుతువపన సీజన్ ముగియడంతో ఈశాన్య రుతుపవన సీజన్ ప్రారంభంకానుంది. దీనికితోడు అరేబియా సముద్రంలో అస్నా తుఫాను ఉత్పన్నమైవుండగా, తూర్పుమధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. మధ్యపశ్చిమ, దాన్ని అనుకునివున్న ఉత్తర పశ్చిమ బంగాళాఖాతంలో ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీర ప్రాంతంలో అల్పపీడనం కేంద్రీకృతమైవుందని పేర్కొంది. ఇది మరింత బలోపేతమవుతూ ఉత్తర తమిళనాడు దిశగా కదులుతుందని వెల్లడించింది. ఈ కారణంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ కారణంగా చెన్నై, దాని చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూర్ సహా పలు జిల్లాల్లో జల్లులు కురుస్తున్నాయి. ఈ వర్ష ప్రభావం వచ్చే ఏడు రోజుల పాటు కొనసాగుతుందని వాతావరణశాఖ వెల్లడించింది. చెన్నై, దాని పరిసర ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, నగరంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. పగటి ఉష్ణోగ్రత గరిష్ఠంగా 34 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 27 డిగ్రీల మేరకు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. గల్ఫ్ ఆఫ్ మన్నార్, దక్షిణ తమిళనాడు కోస్తా తీర ప్రాంతాలతో పాటు ఉత్తర తమిళనాడు తీర ప్రాంతంలో భారీ ఈదురుగాలులు గంటకు 35 కిలోమీటర్ల వేగం నుంచి 45 కిలోమీటర్ల వేగం వరకు వీచే ప్రభావం ఉందని తెలిపింది. అలాగే, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

సీఎం స్టాలిన్ సమక్షంలో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటున్న గూగుల్ సంస్థ నిర్వాహకులు



ఆపిల్, మైక్రోసాఫ్ట్ అధికారులతో స్టాలిన్ భేటీ

● గూగుల్‌తో కుదిరిన ఒప్పందం

చెన్నై, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విదేశీ పారిశ్రామిక పెట్టుబడుల సమీకరణ కోసం అమెరికాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ ఆపిల్, గూగుల్, మైక్రోసాఫ్ట్ సంస్థల ఉన్నతాధికారులు, ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఆ సందర్భంగా జరిగిన చర్చల్లో రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించమంటూ ఆ సంస్థల నిర్వాహకులకు పిలుపునిచ్చారు. తొలుత క్యాలిఫోర్నియాలో ఆపిల్ సంస్థ కార్పొరేట్ కార్యాలయాన్ని రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి టీఆర్‌బీ రాజా, ఇతర అధికారులతో కలిసి సీఎం సందర్శించారు. రాష్ట్రంలోని ఫ్లెక్స్‌ట్రానిక్స్, హాన్ హయ్ (ఫాక్స్‌కాన్), పెకట్రాన్, టాటా ఎలక్ట్రానిక్స్ తదితర సంస్థల్లో ఆపిల్ సంస్థ భాగస్వామ్యం కలిగి ఉంటోందని, ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు నెలకొల్పేందుకు, వాణిజ్య కార్యకలాపాలను విస్తరించేందుకు ఆపిల్ సంస్థ ముందుకు రావాలని స్టాలిన్ కోరారు. ఆ తర్వాత కృత్రిమ మేధోపరిజ్ఞానం, ఆన్‌లైన్ వాణిజ్యం, సెర్చ్ ఇంజన్ టెక్నాలజీ, క్లౌడ్ కంప్యూటింగ్, సాఫ్ట్‌వేర్, క్వాంటమ్ కంప్యూటింగ్, ఈ-కామర్స్ సేవలందిస్తున్న గూగుల్ సంస్థ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ ఉన్నతాధికారులతోనూ స్టాలిన్ భేటీ అయ్యారు. క్యాలిఫోర్నియాలో మౌంట్ వ్యూలో ఉన్న ఆ సంస్థ ప్రధాన కార్యాలయానికి వెళ్లి అక్కడి ప్రతినిధులతో చర్చించారు. ఆ సందర్భంగా రాష్ట్రంలో తయారు చేస్తున్న పిక్సెల్ 8 ఫోన్ల ఉత్పత్తిని అధికం చేసే దిశగా గూగుల్ సంస్థ చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర విద్యార్థుల్లో ప్రతిభాపాటవాలను పెంపొందించడానికి గూగుల్‌తో కృత్రిమ మేధోపరిజ్ఞానం అందించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఆ తర్వాత గూగుల్ సంస్థ రాష్ట్ర పారిశ్రామిక మార్గదర్శక సంస్థతో కలిసి కృత్రిమ మేధోపరిజ్ఞానం (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) పరిశోధనలు జరిపేలా అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అటుపిమ్మట మైక్రోసాఫ్ట్ సంస్థ లింక్‌డిన్ సీఈఓ. రాయన్ రోస్‌లాన్స్‌కీతో స్టాలిన్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో డేటా సెంటర్ విస్తరణ, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేయడం వంటి అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రితోపాటు రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి టీఆర్‌బీ రాజా, పరిశ్రమలు, పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖల కార్యదర్శి వి.అరుణ్‌రాయ్, పారిశ్రామిక మార్గదర్శక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.విష్ణు తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆ 3 సంస్థలతో వాణిజ్య సంబంధాలు..

ఆపిల్, మైక్రోసాఫ్ట్, గూగుల్ సంస్థలను సందర్శించడం తనకెంతో ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఎక్స్ పేజీలో ఓ సందేశం పొందుపరిచారు. రాష్ట్రానికి పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి ఈ మూడు సంస్థల సహాయసహకారాలు అవసరమని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి ఈ మూడు సంస్థలతో మరిన్ని అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటామని తెలిపారు.ఈమూడు సంస్థలతో వాణిజ్య సంబంధాలు మెరుగుపరిచేందుకు పాటుపడతామని కూడా స్టాలిన్ తెలిపారు.



కాలువల నిర్మాణాలు పరిశీలిస్తున్న సీఎస్ మురుగానందం

అధికారులకు సీఎస్ మురుగానందం ఉత్తర్వులు

స్వయంగా పనుల పరిశీలన

యుద్ధప్రాతిపదికన వాననీటి కాలువ పనులు

ప్యారీస్, ఆగస్టు 31: ఉత్తర చెన్నైలో ప్రభుత్వ వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన వాననీటి కాలువల పనులను రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం శనివారం ఉదయం అధికారులతో కలసి పరిశీలించారు. ఈశాన్య రుతుపవనాలను దృష్టిలో ఉంచుకొని జలవనరులు, రహదారుల శాఖ, విద్యుత్ బోర్డు ఆధ్వర్యంలో ఉత్తర చెన్నై పరిధిలోని పలు నియోజకవర్గాల్లో పనులు జరుగుతున్నాయి. రాయపురం నియోజకవర్గంలోని 61వ వార్డు, పూందమల్లి హైరోడ్డు, ఎగ్మూర్ గాంధీ ఇర్విన్ వంతెన సమీపంలోని రైలు మార్గం పక్కన రూ.5.20 కోట్లతో నిర్మిస్తున్న కాలువ, నీటి సేకరణ పనులు, కొళత్తూర్ రెట్టేరి జంక్షన్‌లో రూ.80 కోట్లతో నిర్మిస్తున్న సమగ్ర వాననీటి కాలువ నిర్మాణ పనులు, పెరంబూర్ పేపర్ మిల్స్ రోడ్డులో జరుగుతున్న పనులను సీఎస్ పరిశీలించారు. అనంతరం అంబేడ్కర్ ప్రభుత్వ మహోన్నత పాఠశాలకు వెళ్లి విద్యార్థుల చేరిక, టీచర్ల సంఖ్య తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో కనీస వసతులు పరిశీలించిన అనంతరం, విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు చేపట్టాల్సిందిగా ప్రధానోపాధ్యాయుడికి సలహా ఇచ్చారు. తిరువిక నగర్ కార్పొరేషన్ జోన్ పరిధిలోని డెమలస్ రోడ్డులో రూ.15.57 కోట్లతో బకింగ్‌హామ్ కాలువకు వాననీరు చేరేలా నిర్మిస్తున్న కాలువ పనులు పరిశీలించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో యుద్ధప్రాతిపదికన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కాగా సీఎస్‌తో పాటు తాగునీటి పంపిణీ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.కార్తికేయన్, జీసీసీ కమిషనర్ జె.కుమరగురుపరన్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పరిశీలనలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో మరో 2 'వందేభారత్' రైళ్లు

● వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ



ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చెన్నై - నాగర్‌కోవిల్ వందేభారత్ రైలుకు పచ్చజెండా ఊపుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ. సెంట్రల్ స్టేషన్ నుంచి ప్రయాణికులకు వీడ్కోలు పలుకుతున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి, కేంద్ర మంత్రి మురుగన్, మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తదితరులు

చెన్నై, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా మరో రెండు వందేభారత్ రైళ్లు పట్టాలెక్కాయి. ఎగ్మూరు - నాగర్‌కోవిల్, మదురై - బెంగళూరు కంటోన్మెంట్ మధ్య ఈ రెండు వందేభారత్ రైళ్లను ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం ఉదయం ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. ఇప్పటికే రాష్ట్రంలో చెన్నై సెంట్రల్ నుంచి మైసూరుకు, కోయంబత్తూరుకు, విజయవాడకు, ఎగ్మూరు నుంచి తిరునెల్వేలికి, కోయంబత్తూరు నుంచి బెంగళూరుకు మొత్తం ఐదు మార్గాల్లో వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. కొత్తగా మరో రెండు వందేభారత్ రైళ్లు ప్రారంభం కావడంతో రాష్ట్రంలో వాటి సంఖ్య ఏడుకు పెరిగింది. చెన్నై సెంట్రల్ స్టేషన్‌లో ఏర్పాటైన వందేభారత్ రైలు సర్వీసు ప్రారంభోత్సవంలో గవర్నర్ ఆర్‌ఎన్ రవి, కేంద్ర మంత్రి ఎల్ మురుగన్, పుదుచ్చేరి మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పాల్గొని పచ్చజెండా ఊపి ఆ రైలును ప్రారంభించారు. ఆ తర్వాత గవర్నర్ వందే భారత్ రైలులో ప్రయాణిస్తున్న బాలబాలికలతో ముచ్చటించారు. ఈ రైలు ఎగ్మూరు స్టేషన్ నుంచి రోజూ బయలుదేరుతుందని దక్షిణ రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఇదే విధంగా మదురై రైల్వేస్టేషన్‌లో ఏర్పాటైన వందేభారత్ రైలు సర్వీసు ప్రారంభోత్సవంలో రైల్వే శాఖ సహాయ మంత్రి వి. సోమన్నా పచ్చజెండా ఊపి రైలును ప్రారంభించారు. ఈ రెండు రైళ్ల సెప్టెంబర్ 2 నుంచి సర్వీసులు బయలు దేరుతాయి.

ఛార్జీల వివరాలు...: ఎగ్మూరు నుంచి నాగర్‌కోవిల్ వెళ్లేందుకు ఏసీ ఛైర్ కార్‌లో రూ.1760, ఎగ్జిక్యూటివ్ ఛైర్ కార్‌లో రూ.3240ను ఛార్జీగా వసూలు చేస్తారు. మరోమార్గంలో ఏసీ ఛైర్‌కార్‌లో రూ.1735, ఎగ్జిక్యూటివ్ ఛైర్‌కార్‌లో రూ.3220ను వసూలు చేస్తారు. ఇదే రీతిలో మదురై నుంచి బెంగళూరుకు వందే భారత్ రైలులో ఏసీ ఛైర్‌కార్‌లో రూ.1575, ఎగ్జిక్యూటివ్ ఛైర్‌కార్‌లో రూ.2865ను ఛార్జీలుగా చెల్లించాల్సి ఉంటుంది. మరోమార్గంలో ఏసీ ఛైర్‌కార్‌లో రూ.1740లు, ఎగ్జిక్యూటివ్ ఛైర్‌కార్‌లో రూ.3060ను ఛార్జీలుగా వసూలు చేయనున్నారు. ఎగ్మూరు - నాగర్‌కోవిల్ రైలు ఉదయం 5 గంటలకు బయలుదేరుతుంది. మరోమార్గంలో నాగర్‌కోవిల్ నుంచి మధ్యాహ్నం 2.20 గంటలకు ఎగ్మూరుకు బయలుదేరుతుంది. మదురై బెంగళూరు రైలు ఉదయం 5.15 గంటలకు మదురై నుంచి బయలుదేరుతుంది. బెంగళూరు నుండి మధ్యాహ్నం 1.30 గంటలకు మదురైకి బయలుదేరుతుందని అధికారులు తెలిపారు. ఈ రైలు మంగళవారం నడవదు.

రాక్షస అలలకు ముగ్గురు విద్యార్థుల బలి

● మహాబలిపురంలో విషాదం



రోషన్, గౌతం, ప్రకాష్ (ఫైల్ ఫొటోలు)

పెరంబూర్, ఆగస్టు 31: మహాబలిపురం సముద్రతీరంలో స్నానం చేస్తున్న ముగ్గురు విద్యార్థులు గల్లంతయ్యారు. అన్నానగర్‌లోని కందస్వామి ఆర్ట్స్ కళాశాలలో బీకాం చదువుతున్న 17 మంది విద్యార్థులు శుక్రవారం 9 మోటర్ సైకిళ్లపై మహాబలిపురం విహారయాత్రకు వెళ్లారు. అక్కడి పురాతన శిల్పాలు, సముద్ర ఆలయం, వెన్నముద్ద తదితర ప్రాంతాలను చూసిన యువకులు.. ఈసీఆర్ రోడ్డు సమీపంలోని సముద్రతీరానికి వెళ్లి ఆనందంగా స్నానాలు చేస్తూ కేరింతలతో గడిపారు. ఆ సమయంలో ఊహించని విధంగా వచ్చిన భారీ అలకు అయనావరానికి చెందిన రోషన్ (19), చూలై కి చెందిన ప్రకాష్ (19), చెట్‌పెట్‌కు చెందిన గౌతం (19) కొట్టుకుపోయారు. వారిని రక్షించేందుకు సహచర విద్యార్థులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సమాచారం అందుకున్న తిరుపోరూర్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, మహాబలిపురం పోలీసులు అక్కడకు చేరుకొని రోషన్‌ను మాత్రం రక్షించి పూంజేరి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో, మహాబలిపురం సమీపం పట్టిపుల్లం సముద్రతీరానికి శనివారం ఉదయం మరో ఇద్దరి మృతదేహాలు కొట్టుకొచ్చాయి. ఈ మృతదేహాలు గల్లంతైన ప్రకాష్, గౌతంగా మహాబలిపురం పోలీసులు నిర్ధారించారు. మృతదేహాలను చెంగల్పట్టు ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సమాచార దర్శిని

బిసెంట్ నగర్‌కు ప్రతిరోజు 100 ప్రత్యేక ఎంటీసీ బస్సులు

పెరంబూర్, ఆగస్టు 31: స్థానిక బిసెంట్‌నగర్‌లో ప్రసిద్ధిచెందిన మేరీమాత ఆలయ ఉత్సవాలు గత నెల 29వ తేది ప్రారంభమై ఈనెల 8వ తేది వరకు జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రతిరోజు 100 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ప్రకటించింది. పెరంబూర్, ఎన్నూర్, తాంబరం, తిరువొత్తియూర్, కోయంబేడు సహా పలు ప్రాంతాల నుంచి సాయంత్రం 4 నుంచి రాత్రి 12 గంటల వరకు బిసెంట్ నగర్‌కు ఈ బస్సులు నడుస్తాయని అధికారులు తెలిపారు.

4 నుంచి వెటర్నరీ వైద్యకోర్సుల కౌన్సెలింగ్

ఐసిఎఫ్, ఆగస్టు 31: వెటర్నరీ వైద్యకోర్సుల కౌన్సెలింగ్ ఈ నెల 4వ తేది ప్రారంభం కానుంది. తమిళనాడు వెటర్నరీ వైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో చెన్నై, నామక్కల్, తిరునల్వేలి, ఒరత్తనాడు, సేలం సహా ఏడు చోట్ల వెటర్నరీ వైద్యకళాశాలలున్నాయి. వీటిలో 5 సంవత్సరాల 6 నెలల బీవీఎస్సీ, ఏహెచ్ కోర్సు నిర్వహిస్తున్నారు. అలాగే, కొడువలిలో బీటెక్ వంటి కోర్సులకు 2024-25 విద్యా సంవత్సరం అడ్మిషన్ల ర్యాంకుల జాబితా గత నెల 7వ తేది విడుదల చేశారు. ఈ రెండు కోర్సులకు 4వ తేది నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. మొదటి రోజు ప్రత్యేక విభాగం కౌన్సిలింగ్, 5న 7.5 శాతం రిజర్వేషన్‌కు సంబంధించిన కౌన్సిలింగ్ స్థానిక వెప్పేరిలో ఉన్న వెటర్నరీ వైద్యకళాశాల ప్రాంగణంలో జరుగనున్నాయి. బీటెక్ కోర్సులకు 6వ తేది కౌన్సెలింగ్ జరగనుంది. విద్యార్థులు తమకు నచ్చిన కళాశాలను ఈ నెల 7వ తేది వరకు నమోదు చేసుకోవచ్చు. అడ్మిషన్ కేటాయింపు ఉత్తర్వులు 11వ తేది విద్యార్థులకు అందజేస్తారు. వివరాలకు www.adm.tanuvas.ac.in, www.tanuvas.ac.in లో చూడవచ్చు.

5 వరకు రేషన్‌షాపుల్లో ఆగస్టు కోటా కందిపప్పు, పామాయిల్ పంపిణీ

పెరంబూర్, ఆగస్టు 31: రేషన్ దుకాణాల్లో ఆగస్టు నెలకు సంబంధించిన కందిపప్పు, పామాయిల్ కొనుగోలు చేయని వినియోగదారులు, ఈనెల 5వ తేది వరకు వాటిని పొందవచ్చని ఆహార శాఖ శనివారం ప్రకటన విడుదల చేసింది. ఆగస్టు నెల కందిపప్పు, పామాయిల్ రేషన్ దుకాణాలకు సరఫరా చేయడంలో జాప్యం జరిగిందని, అందువల్ల పలువురు వాటిని పొందలేకపోయినట్లు ఫిర్యాదులందాయన్నారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం, ఆగస్టు నెల కందిపప్పు, పామాయిల్ పొందని వారు ఈ నెల 5వ తేది వరకు రేషన్ దుకాణాల్లో వాటిని కొనుగోలు చేయవచ్చని ఉత్తర్వులు జారీ చేసింది.

21న ఎంఎన్‌ఎం సర్వసభ్య సమావేశం

పెరంబూర్, ఆగస్టు 31: మక్కల్ నీతి మయ్యం సర్వసభ్య సమావేశం ఈ నెల 21న జరగనుంది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. తేనాంపేటలోని కామరాజర్ ఆడిటోరియంలో 21న ఉదయం 9 గంటలకు పార్టీ అధ్యక్షుడు కమలహాసన్ నేతృత్వంలో సమావేశం జరగనుంది. సమావేశంలో గత నెల 23వ తేది జరిగిన పార్టీ నిర్వహణ కమిటీ, కార్యవర్గ సమావేశాల్లో తీసుకున్న 12 తీర్మానాలపై చర్చ, పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయడం, భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చించనున్నట్లు ఎంఎన్‌ఎం తెలియజేసింది.

ఇంటి గ్రంథాలయానికి పురస్కారం

ఐసిఎఫ్, ఆగస్టు 31: ఇంటి గ్రంథాలయాలకు పురస్కారాలు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. నగరంలో ప్రతి ఇంటా గ్రంథాలయాలు ఏర్పాటు చేసి ఉత్తమంగా నిర్వహించే వ్యక్తులకు జిల్లాలో నిర్వహించే బుక్ ఎగ్జిబిషన్‌లో స్వీయ గ్రంథాలయాలకుగాను పురస్కారం, రూ.3 వేల విలువైన షీల్డు, సర్టిఫికెట్‌ను కలెక్టర్లు అందజేయనున్నారు. ఈ పురస్కారానికి దరఖాస్తు చేసుకొనేవారు తమ ఇంట్లో ఉన్న గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు, ఏ రకమైన పుస్తకాలు ఉన్నాయి, అరుదైన గ్రంథాల వివరాలు, పేరు, చిరునామా, మొబైల్ నెంబర్లతో dlochennai1@gmail.com చిరునామాకు పంపించాలి. అలాగే, జిల్లా గ్రంథాలయ అధికారి, జిల్లా గ్రంథాలయ కమిషన్ కార్యాలయం,నెం.735, అన్నాసాలై, చెన్నై-2 అనే చిరునామాలో కూడా సంప్రదించవచ్చు.

వ్యవసాయ వృత్తి ప్రారంభిస్తే రూ.లక్ష సబ్సిడీ

ఐసిఎఫ్, ఆగస్టు 31: వ్యవసాయానికి సంబంధించిన వృత్తులు ప్రారంభించే పట్టభద్రులకు బ్యాంక్ రుణంతో పాటు రూ.లక్ష సబ్సిడీ అందజేయనున్నట్లు వ్యవసాయ ఉత్పత్తుల శాఖ కమిషనర్, ప్రధాన కార్యదర్శి అపూర్వ తెలిపారు. వ్యవసాయంపై యువకులకు ఆసక్తి పెంచడంతో పాటు వ్యవసాయం అభివృద్ధి పరిచేలా పట్టభద్రులైన యువకులను వ్యవసాయ పారిశ్రామికులుగా మార్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ వృత్తులు ప్రారంభించే యువకులకు రూ. లక్ష సబ్సిడీ అందజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, ఆ ప్రకారం ఈ ఏడాది 100 మంది యువకులకు బ్యాంక్ రుణసాయంతో పాటు సబ్సిడీ కూడా అందజేస్తామని తెలిపారు. ఈ పథకం కోసం ప్రభుత్వం రూ. కోటి కేటాయించిందని తెలిపారు. ఔత్సాహికులు తమ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం, బ్యాంక్ నుంచి పొందిన రుణ ఆమోద పత్రం, వృత్తులకు సంబంధించిన వివరాలతో తాలూకా, వ్యవసాయ కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు.

యూజీ కోర్సుల్లో 93 వేల సీట్ల భర్తీ

ఐసిఎఫ్, ఆగస్టు 31: రాష్ట్రంలో ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో యూజీ కోర్సుల్లో 93,000 సీట్లు భర్తీ కాగా, 19,000 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఉన్నత విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ శాఖ ఆధ్వర్యంలో 164 ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలు పని చేస్తున్నాయి. వీటిలో బీఎస్సీ బీకాం, బీఏ అని వివిధ కోర్సుల్లో 1,12,729 యూజీ సీట్లు ఉన్నాయి. 2024-25 విద్యా సంవత్సరం విద్యార్థుల అడ్మిషన్ కౌన్సెలింగ్ ఇటీవల ముగిసింది. అన్ని కళాశాలల్లో కలిపి ఇప్పటివరకు 93,700 సీట్లు మాత్రమే భర్తీ కాగా, 19,000 సీట్లు ఖాళీగా ఉన్నాయి. గత విద్యా సంవత్సరంలో 1.03 లక్షల సీట్లు భర్తీ అయ్యాయి. ఈ సంవత్సరం బీకాం, బీఏ కోర్సుల్లో విద్యార్థులు ఎక్కువ మంది చేరగా, గణిత విభాగంలో తక్కువ సంఖ్యలో చేరారని అధికారులు తెలిపారు.

చెన్నైలో ఈదురుగాలులతో కూడిన వర్షం

● 19 విమాన సర్వీసులకు అంతరాయం

పెరంబూర్, ఆగస్టు 31: నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి హఠాత్తుగా ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. సెంట్రల్ రైల్వేస్టేషన్, ఎగ్మూర్, పురుషవాక్కం, చెట్‌పెట్, అమింజికరై, బ్రాడ్‌వే, ఈకాట్టుతాంగల్, వానగరం, ఆవడి, సెయింట్ థామస్ మౌంట్, టీనగర్ సహా పలు ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లపై నీరు ప్రవహించింది. వర్షానికి ఈదురుగాలులు తోడడంతో వాతావరణం అనుకూలించక చెన్నై నుంచి బయల్దేరాల్సిన విమానాల్లో జాప్యం చోటుచేసుకుంది. 9 విమానాలు, పలు నగరాల నుంచి రావాల్సిన 10 విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. అప్పటివరకు గాల్లో చక్కర్లు కొట్టిన విమానాలు, వాతావరణం అనుకూలించడంతో ఒక్కొక్కటిగా ల్యాండింగ్ కాగా, ఒక్కొక్కటి బయల్దేరి వెళ్లాయి.





పొత్తేరి కళాశాల వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు - ఓ హాస్టల్‌లో తనిఖీ చేయడానికి వెళ్తున్న పోలీసులు

పొత్తేరిలో పోలీసుల గంజాయి వేట

● 30 మంది విద్యార్థుల అరెస్టు

చెన్నై, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా పొత్తేరిలోని ఓ ప్రైవేటు కళాశాల పరిసర ప్రాంతాల్లో విద్యార్థుల హాస్టళ్లలో పోలీసులు గంజాయి వేట జరిపారు. ఆ కళాశాల చుట్టూ ఉన్న వసతి గృహాల్లో బస చేస్తున్న విద్యార్థులు గంజాయి వంటి మాదకద్రవ్యాలను సేవిస్తున్నట్లు సమచారం అందడంతో శనివారం ఉదయం సుమారు 500 మంది పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తొలుత వసతి గృహాలు, స్టూడెంట్ హాస్టళ్లలో సోదాలు జరిపారు. అటు పిమ్మట ఆ కళాశాలలోకి వెళుతున్న విద్యార్థులను బయటే నిలబెట్టి తనిఖీలు జరిపారు. ఈ తనిఖీల్లో గంజాయి, మత్తుమాత్రలు తదితర మాదకద్రవ్యాలు భారీ యెత్తున పట్టుబడ్డాయి. ఈ సంఘటనకు సంబంధించి 30 మంది విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. వీరందరిని ఓ ప్రైవేటు కల్యాణమండపానికి తరలించి పోలీసులు ముమ్మరంగా విచారణ జరుపుతున్నారు. సుమారు రెండు గంటలకు పైగా పోలీసులు కళాశాల చుట్టూ ఉన్న వసతి గృహాలు, ప్రైవేటు లాడ్జీలలో తనిఖీ చేయడం కలకలం రేపింది.

151 ప్రభుత్వ పాఠశాలల్లో మేనేజింగ్ కమిటీ సభ్యుల ఎంపిక



కొత్తగా ఎంపికైన సభ్యులకు సర్టిఫికెట్లు అందిస్తున్న జనార్దనన్

వేలూరు, ఆగస్టు 31: జిల్లాలో 151 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పాఠశాల మేనేజింగ్ కమిటీ సభ్యుల ఎంపిక పూర్తయింది. ఈ కమిటీల సమావేశం కాట్పాడి సమీపం అరుప్పమేడు కార్పొరేషన్ స్కూలులో శనివారం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ అధ్యక్షత వహించగా, కౌన్సిలర్ శరవణన్ పాల్గొని, కొత్తగా ఎంపికైన సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో తమిళనాడు సైన్స్ సమాఖ్య అధ్యక్షుడు జనార్దనన్ ప్రసంగించారు. పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు శ్యామల, ఉపాధ్యక్షులు నీలవేణి, సెక్రటరీ శరవణన్, కమిటీ సభ్యులు కార్కుయల్, వసంతకుమార్, అనిత, దివ్య, దండపాణి సహా కొత్తగా ఎంపికైన 24 మంది సభ్యులు పాల్గొన్నారు. పాఠశాల ఉప ప్రధానోపాధ్యాయుడు శివసుబ్రమణ్యం వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

కోటీశ్వరుల కోసం పాటుపడుతున్న మోదీ

● టీఎన్‌సీసీ చీఫ్ సెల్వపెరుంతగై విమర్శ

చెన్నై, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లుగా ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వ అసమర్థపాలన వల్ల పేదలు మరింత నిరుపేదలుగా మారుతున్నారని, కార్పొరేట్ సంస్థ యజమానులు, లక్షాధికారులు కోట్లకు పడగెత్తారని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన జారీ చేస్తూ గత పదేళ్లుగా దేశంలో కోటీశ్వరుల సంఖ్యే విపరీతంగా పెరిగినట్లు థామస్‌పిగెట్టి నివేదిక వెల్లడించిందని, ఆంగ్లేయుల కాలంలో కంటే బీజేపీ పాలనలోనూ పదేళ్లుగా ప్రజల మధ్యఅసమానతలు అత్యధికమయ్యాయని తెలిపారు. దేశంలో ఉన్నతస్థితిలో ఉన్న ఒకే ఒక శాతం మంది వద్ద 70 శాతం ఆస్తులు ఉన్నాయని ఆధారాలతో ఆ నివేదికలో పేర్కొన్నట్లు తెలిపారు. 80 కోట్ల మంది దారిద్ర్యంతోనే బాధపడు తున్నారని, ప్రభుత్వమిచ్చే ఉచిత రేషన్ ధాన్యం పంపిణీ స్థాయిని బట్టి ఈ వాస్తవం రుజువవుతోందని తెలిపారు. చైనాలో 25 శాతం దాకా కోటీశ్వరుల సంఖ్య తగ్గితే, భారతదేశంలో కోటీశ్వరుల సంఖ్య 29 శాతానికి పెరిగిందని, ఇదే మోదీ పరిపాలన సాధించిన ప్రగతి అని సెల్వపెరుంతగై ఎద్దేవా చేశారు.

11న తిరువారూరులో ఓపీఎస్ వర్గీయుల ధర్నా

చెన్నై, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తిరువారూరులో ధాతు ఇసుక తవ్వకాలకు ప్రైవేటు సంస్థను అనుమతించడాన్ని ఖండిస్తూ సెప్టెంబర్ 11న పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించనున్నట్లు మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) ప్రకటించారు. సురక్షిత వ్యవసాయ క్షేత్రంగా ఉన్న డెల్టా జిల్లాల్లో చమురు తవ్వకాలు, ధాతు ఇసుక తవ్వకాలు చేపట్టకూడదని, అయినా రాష్ట్ర ప్రభుత్వం డి.వడక్కాడు సమీపంలో 11 ఎకరాల విస్తీర్ణం కలిగిన భూముల్లో ధాతు ఇసుక తవ్వకాలు జరిపేందుకు ప్రైవేటు సంస్థకు అనుమతించిందని ఆరోపించారు.ఆ అనుమతి రద్దు చేయాలని కోరుతూ తమ వర్గానికి చెందిన మాజీ మంత్రి ఆర్ వైద్యలింగం, శివనారాయణస్వామి తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

బాణసంచా కర్మాగారంలో పేలుడు

ఇద్దరి మృతి, నలుగురికి గాయాలు

చెన్నై, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బాణసంచా కర్మాగారంలో పేలుడు ఘటనలో ఇద్దరు మృతి చెందారు. నలుగురు గాయపడ్డారు. తూత్తుకుడి జిల్లా మిచెన్‌కుళం గ్రామంలో ఉన్న బాణసంచా కర్మాగారంలో శనివారం సాయంత్రం పేలుడు జరిగింది. ఈ ప్రమాదానికి షార్ట్‌సర్క్యూటే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతులు, క్షతగాత్రులంతా యువకులే. కాగా ఈ ఘటన పట్ల తీవ్ర సంతాపం ప్రకటించిన సీఎం స్టాలిన్, మృతుల కుటుంబాలకు తలా రూ.5 లక్షలు, క్షతగాత్రులకు తలా లక్ష రూపాయలు అందించనున్నట్టు ప్రకటించారు.

విద్యార్థులతో కలసి నీతి కథలు విన్న మంత్రి



విద్యార్థుల పక్కనే బెంచీపై కూర్చున్న మంత్రి అన్బిల్ మహేష్

పెరంబూర్, ఆగస్టు 31: రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ రాష్ట్రవ్యాప్తంగా 'కాఫీ విత్ విద్యాశాఖ మంత్రి' పేరుతో విద్యార్థులతో భేటీ అవుతున్నారు. ఈ నేపథ్యంలో, కన్నియాకుమారి జిల్లా కరుంగల్‌లోని ప్రభుత్వ మహోన్నత పాఠశాలను శుక్రవారం మంత్రి అన్బిల్ మహేష్ పరిశీలించారు. పాఠశాలలోని మౌలిక వసతులు పరిశీలించిన మంత్రి, 9వ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులను పలకరించారు. అనంతరం విద్యార్థుల పక్కనే బెంచీపై కూర్చున్న మంత్రి, ఓ విద్యార్థి చెప్పిన నీతి కథలు విన్నారు.

ప్రభుత్వ బస్సా.... ఫాగింగ్ వాహనమా?



దట్టమైన పొగ వెదజల్లుతున్న ప్రభుత్వ బస్సు

పెరంబూర్, ఆగస్టు 31: మదురై నగరంలో వెళ్తున్న ప్రభుత్వ బస్సును చూసి అక్కడి ప్రజలు ఆశ్చర్యపోయారు. మదురై పెరియార్ బస్టాండ్ నుంచి బయల్దేరిన ప్రభుత్వ బస్సు దట్టమైన పొగ వెలువరిస్తూ రోడ్లపై ప్రయాణించింది. దీంతో, బస్సు వెనుకగా వెళ్తున్న వాహనచోదకులు, రోడ్డు పక్కనే వెళుతున్న పాదచారులు ఇబ్బంది పడ్డారు. ఇది ప్రభుత్వ బస్సా... దోమల మందు చల్లే వాహనమా అంటూ ప్రజలు హేళన చేశారు. ఈ దృశ్యాన్ని కొందరు యువకులు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు.

విమానమెక్కిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

● సర్పంచ్ ఔదార్యం



విమానంలో విద్యార్థులతో సర్పంచ్ జ్ఞానసేగరన్

పెరంబూర్, ఆగస్టు 31: కోయంబత్తూర్ జిల్లా మేట్టుపాళయం తాలూకా కారమడై పంచాయతీ యూనియన్ పరిధిలో సికార్కరం పాళయం పంచాయతీ ఉంది. ఈ పంచాయతీలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అధిక శాతం మంది పేద కుటుంబాలకు చెందినవారే. వీరికి విమానం ఆకాశంలో వెళ్తుంటే చూసి ఆనందించేది మాత్రమే తెలుసు. ఈ నేపథ్యంలో, సర్పంచ్ జ్ఞానసేగరన్ విద్యార్థులను విమానంలో తీసుకెళ్లాలని నిర్ణయించారు. 75 మంది విద్యార్థులు, వారితో తలా ఒకరు అని మరో 75 మంది, విద్యార్థులకు భద్రత కల్పించేలా 15 మంది ఉపాధ్యాయులు అని మొత్తం 165 మందిని కోవై నుంచి విమానంలో చెన్నైకి తీసుకొచ్చారు. ఉదయం అల్పాహారం అనంతరం వారిని మెట్రో రైలులో ప్రయాణింపజేసి, అన్నా సెంటినరీ లైబ్రరీ, ప్లానిటోరియం తదితరాలను చూపించి తిరిగి స్వగ్రామానికి తీసుకెళ్లారు. సర్పంచ్ ఔదార్యాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు అభినందించారు.



శనివారం రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవితో మర్యాదపూర్వకంగా భేటీ అయిన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్

ఐఎన్‌ఎస్ రాజాలిలో క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్ కోర్సు గ్యాడ్యుయేషన్



అడయార్, ఆగస్టు 31: తిరువళ్లూరు జిల్లా అరక్కోణంలోని ఐఎన్‌ఎస్ రాజాలిలో క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్ కోర్సు రెండో గ్రాడ్యుయేషన్‌ను విజయ వంతంగా నిర్వహించారు. మొత్తం 24 మంది ఈ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్ కోర్సును పూర్తి చేయగా, వీరికి గ్యాడ్యుయేషన్ నిర్వహించారు. ఇందులో లెఫ్టినెంట్ కమాండర్ రజత్ బాలమోహన్, లెఫ్టినెంట్ కమాండర్ అర్ష్ బన్సల్ పాల్గొని క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్లకు బ్యాడ్జీలను ప్రదానం చేశారు. ఎస్‌హెచ్‌ఎఫ్‌ఐసీలో 22 వారాల శిక్షణ కార్యక్రమంలో బోధనా సామర్థ్యాలతో వివిధ అంశాలతో ఈ శిక్షణను గ్యాడ్యుయేట్లు విజయవంతంగా పూర్తి చేసుకున్నారు.

జేష్ఠ్యా దేవి విగ్రహం లభ్యం



సెంజి సమీపంలో లభ్యమైన విగ్రహం

ఐసిఎఫ్, ఆగస్టు 31: సెంజి సమీపంలో పల్లవుల కాలం నాటి జేష్ఠాదేవి విగ్రహం బయల్పడింది. తిరువణ్ణామలై చరిత్ర పరిశోధకులు, సెంజి ప్రభుత్వ కళాశాల తమిళ శాఖ అధ్యాపకులు సంయుక్తంగా సెంజి సమీపంలోని కోనై గ్రామంలో పరిశోధనలు చేపట్టారు. అక్కడున్న ఓ పాఠశాల ప్రాంగణంలో 105 సెం.మీ ఎత్తు, 80 సెం.మీ వెడల్పు కలిగిన విగ్రహాన్ని గుర్తించారు. ఈ విగ్రహం 8వ శతాబ్దానికి చెందిన పల్లవుల కాలానికి సంబంధించిందని, గ్రామంలోని వాగులో ప్రాచీన ఆలయం ఉండి ఉండొచ్చని తెలిపారు. ఈ విగ్రహంతో పాటు రెండు విష్ణువు, ఒక వినాయకుడు విగ్రహాన్ని కనుగొన్నారు.

వేడుకగా కబన్ కళగ 11వ వార్షికోత్సవం



వేడుకల్లో పురస్కారాలు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

వేలూరు, ఆగస్టు 31: గుడియాత్తం కంబన్ కళగం 11వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. కళగ అధ్యక్షుడు రాజేంద్రన్ అధ్యక్షత వహించిన వేడుకలకు, కళగ స్థాపకుడు జేకేఎన్ పళని ఆహ్వానం పలికారు. వేడుకల్లో జిల్లా విద్యా డైరెక్టర్ మదన్, విద్యాశాఖ ఉప డైరెక్టర్ మలర్, తిరువళ్లువర్ వర్శిటీ పరీక్షల కంట్రోల్ అధికారి బాబు జనార్దనన్, సినీ దర్శకుడు భారతి కృష్ణకుమార్‌కు పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళగ సెక్రటరి భూపతి, రచయితలు తమిళ్, తిరుమాళ్, సంపత్‌కుమార్, పారివేందన్, పదుమనార్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

వినాయక చవితి ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో ప్రసంగిస్తున్న డీఐజీ పృథ్వీరాజ్

వేలూరు, ఆగస్టు 31: వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని పోలీసు అధికారులు కోరారు. ఈ నెల 7వ తేది జరుపుకోనున్న వినాయక చవితి ఏర్పాట్లపై శనివారండీఎస్పీ కార్యాలయంలో వివిధ హిందూ సంఘాలతో సమావేశం నిర్వహిం చారు. కార్యక్రమంలో వేలూరు డీఐజీ పృథ్వీరాజ్ సాకాన్ పాల్గొని, 10 అడుగుల కంటే ఎత్తున్న విగ్రహాలు ఏర్పాటు చేయరాదని, విగ్రహాల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు పొందాలన్నారు. నిమజ్జనం ఊరేగింపు ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. సమావేశంలో హిందూ మున్నని డివిజన్ అధ్యక్షుడు మహేష్, సెక్రటరీ పిచ్చాండి, బీజేపీ నేత దశరథన్, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసన్, నాగరాజ్, లత తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌పీఎస్సీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఆగస్టు 31: రాష్ట్ర వృత్తుల అభివృద్ధి సంస్థ సహాయ జనరల్ మేనేజర్ సహా 26 శాఖల్లో ఖాళీగా ఉన్న 105 పోస్టుల భర్తీకి టీఎన్‌పీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఔత్సాహికులు ఈ నెల 28వ తేది వరకు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర సవరణలకు అక్టోబరు 2 నుంచి 4వ తేది వరకు అవకాశం కల్పించారు. రాత పరీక్ష నవంబరు 18 నుంచి 20వ తేది వరకు జరుగనుంది.

నేడు వృత్తి శిక్షణ శిబిరం

ఐసిఎఫ్, ఆగస్టు 31: రాష్ట్ర ప్రతిభాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉత్తర చెన్నై అభివృద్ధి పథకం కింద ఆ ప్రాంత యువకులకు ఉద్యోగ అవకాశంతో కూడిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ స్థానిక బ్రాడ్‌వే ప్రకాశం రోడ్డులో ఉన్న భారతి మహిళా కళాశాలలో ఆదివారం ఉదయం 10 గంటలకు జరగనుంది. ఈ శిబిరంలో ఎమ్మార్‌ఎఫ్, టీవీఎస్, టెక్ మహింద్ర, అశోక్ లేలాండ్, సదర్లాండ్ గ్లోబల్ సర్వీస్, ఎల్జీ, పూర్విక మొబైల్స్ వంటి 23 ప్రైవేటు సంస్థలు పాల్గొంటున్నాయి. ఎనిమిదో తరగతి, టెన్త్, ప్లస్ టూ, ఐటీఐ చదివిన 18 నుంచి 35 ఏళ్లలోపున్న వారు శిబిరానికి హాజరై శిక్షణలో పాల్గొనవచ్చు. ఎంపికయ్యే వారికి రూ.15 వేల నుంచి రూ.22 వేల వరకు వేతనంతో ఉద్యోగం కల్పించనున్నారు. శిక్షణ పొందే యువకులకు సర్టిఫికెట్, రోజుకు రూ.375 ప్రోత్సాహక భత్యం అందజేస్తారు.

చెట్టు కూలి చెన్నై భక్తురాలికి గాయాలు

తిరుమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఓ వృక్షం కూలి చెన్నైకు చెందిన భక్తురాలు గాయపడ్డారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం రాత్రి వరకు వర్షపు చినుకులు పడుతూనే ఉన్న క్రమంలో ఏఎంసీ ప్రాంతంలోని 305 వద్ద ఓ భారీ వృక్షం కూలింది. దీంతో సమీపంలో కూర్చుని ఉన్న ఉమామహేశ్వరి(44)పై కొమ్మలు పడ్డాయి. దీంతో ఆమె తల, శరీరభాగాలపై గాయలయ్యాయి. వెంటనే తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకుని కూలిన వృక్షాన్ని తొలగించారు. చెట్ల కింద ఎవరు కూర్చోవద్దని మైకుల ద్వారా సూచించారు.

వేలూరు ఎక్సైజ్ డీఎస్పీ డిస్మిస్

● డీజీపీ ఉత్తర్వుల జారీ

అడయార్, ఆగస్టు 31: తిరుపత్తూరు జిల్లా ఆంబూరు సమీపంలోని బాలూరులో అక్రమంగా నిల్వవుంచిన 7 టన్నుల ఎర్రచందనం దుంగలను స్మగ్లింగ్ చేసిన కేసులో వేలూరు ఎక్సైజ్ శాఖ డీఎస్పీ తంగవేలును డిస్మిస్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ శంకర్ జివాల్ ఉత్తర్వులు జారీ చేశారు. బాలూరు ప్రాంతానికి చెందిన పీఎంకే నాయకుడు చిన్నపయ్యన్ 2015వ సంవత్సరంలో హత్యకు గురయ్యాడు. దీనిపై అంబూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. వేలూరు జిల్లా డీఎస్పీగా ఉన్న తంగవేలు.. చిన్నపయ్యన్‌కు చెందిన కోళ్లఫారంలో అక్రమంగా నిల్వవుంచిన 7 టన్నుల ఎర్రచందనం దుంగలను తరలించినట్టు తేలింది. తంగవేలు సాయంతోనే చిన్నపయ్యన్ ఎర్రచందనం దుంగలను తన కోళ్లఫారంలో నిల్వ ఉంచినట్టు వెల్లడైంది. ఈ కేసుతో సంబంధం ఉన్న వేలూరు అలివేలుమంగాపురానికి చెందిన నరేంద్రన్, ఆయన భార్య జ్యోతిలక్ష్మి సహా ఆరుగురిని అరెస్టు చేశారు. పైగా తంగవేలు స్మగ్లింగ్ చేసిన 7టన్నుల్లో 3.5టన్నులను నాగేంద్రన్ నివాసం నుంచి స్వాధీనం చేసుకున్నారు. అలాగే రూ.32 లక్షలతో పాటు మూడు కార్లను స్వాధీనం చేసుకున్నారు. అయితే, దుంగలను విక్రయించినట్టు భావించిన నాగేంద్రన్.. తన అనుచరులతో చిన్నపయ్యన్‌ను హత్య చేయించినట్టు విచారణలో తేలింది. ఇదిలావుంటే, ఈ ఎర్రచందనం దుంగల కేసులో వేలూరు ఎక్సైజ్ శాఖ డీఎస్పీ తంగవేలు కీలక పాత్ర పోషించినట్టు నిర్ధరణ కావడంతో ఆయన్ను డిస్మిస్ చూస్తూ డీఎస్పీ ఉత్తర్వులు జారీచేశారు.

తిరుత్తణిలో 35 సవర్ల బంగారు నగల చోరీ

అడయార్, ఆగస్టు 31: తిరుత్తణి రైల్వే గేట్ సమీపంలోని బంగారు నగల దుకాణంలో చోరీ జరిగింది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ చోరీలో 35 సవర్ల బంగారు, వెండి ఆభరణాలతో పాటు రూ.3 లక్షల నగదు కూడా చోరీకి గురైనట్టు సమాచారం. ఈ చోరీ కేసు వివరాలను పోలీసులు వివరిస్తూ, తిరుత్తణి పట్టణం రెండో వీధిలో రైల్వే గేట్ సమీపంలోని ఎస్‌ఎస్‌సీ బోస్ రోడ్డులో షణ్ముగం బంగారు నగల దుకాణం నడుపుతున్నారు. నిత్యం బిజీగా ఉండే ఈ ప్రాంతంలో గత యేడాదిగా రైల్వే ట్రాక్, ఇతర ఇంజనీరింగ్ పనుల నిమిత్తం రైల్వే గేట్ మూసివేశారు. ఈ దారిలో ద్విచక్రవాహనదారులు కూడా వెళ్ళకుండా రైల్వే సిబ్బంది ఆంక్షలు విధించారు. దీంతో ఈ ప్రాంతంలో జనసంచారం తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి తన వ్యాపారకార్యకలాపాలు ముగించుకుని షణ్ముగం ఇంటికి వెళ్ళారు. శనివారం ఉదయం షాపు వద్దకు రాగా, షట్టర్లు తొలగించిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. దొంగలను గుర్తించేందుకు సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. దీనిపై తిరుత్తణి డీఎస్పీ కందన్ మాట్లాడుతూ, ఈ చోరీ కేసును ఛేదించేందుకు ఇన్‌స్పెక్టర్ మదియరసన్ సారథ్యంలో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఫింగర్ ప్రింట్స్ నిపుణులు షాపులో ఆధారాలు సేకరించారన్నారు.

యువకుడి హత్య కేసులో ముగ్గురికి జీవితఖైదు

అడయార్, ఆగస్టు 31: విల్లుపురం జిల్లా నన్నాడు గ్రామానికి చెందిన యువకుడిని హత్య చేసిన కేసులో ముగ్గురికి జీవిత కారాగారశిక్ష విధిస్తూ విల్లుపురం జిల్లా కోర్టు తీర్పును వెలువరించింది. ఈ గ్రామానికి చెందిన నాగరాజ్, ధనుష్ ఇద్దరు వ్యక్తుల మధ్య తోటలో నిలబడిన మురికినీటిని బయటకు పంపించే విషయంపై వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో గత 2016 ఏప్రిల్ 6వ తేదీన ధనుష్, ఈయన సోదరులు వెంకటేష్, సురేష్, ధనుష్ భార్య అంజాలైలు కలిసి వాకింగ్‌కు వెళుతున్న నాగరాజ్‌ను అడ్డగించి దాడి చేసి హత్య చేశారు. ఈ కేసు విచారణ విల్లుపురం జిల్లా క్రైమ్ కోర్టులో జరిగింది. పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి రాజసింహవర్మన్ శుక్రవారం తీర్పును వెలువరించారు. ఈ కేసులో ధనుష్, వెంకటేష్, సురేష్‌లకు జీవితకారాగారశిక్ష విధించగా, అంజాలై పాత్రను నిర్ధారించేలా సరైన ఆధారాలు లేకపోవడంతో ఆమెను నిర్దోషిగా విడుదల చేశారు.

నలుగురు లాయర్లు న్యాయవృత్తి చేపట్టడంపై నిషేధం

పెరంబూర్, ఆగస్టు 31: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ గత జూలై 5వ తేది స్థానిక పెరంబూర్‌లో దారుణహత్యకు గురయ్యాడు. ఆ కేసులో ఆర్కాడు సురేష్ తమ్ముడు పొన్నై బాలు, నలుగురు న్యాయవాదులు సహా 27 మందిని ఇప్పటివరకు పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో తిరువేంగడం పోలీసుల నుంచి తప్పించుకొనే యత్నంలో ఎన్‌కౌంటర్ చేయబడ్డాడు. ఈ కేసులో అజ్ఞాతంలోకి వెళ్లిన మరికొందరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో అరెస్టయిన నలుగురు లాయర్లు న్యాయవృత్తి కొనసాగించేందుకు బార్ కౌన్సిల్ నిషేధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారం, హరిహరన్, అశ్వత్థామన్, శివ, హరిధరన్‌పై కేసు ముగిసే వరకు న్యాయవాద వృత్తి చేపట్టేందుకు నిషేధించింది.

ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో మరొకరి అరెస్టు

చెన్నై, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ నేత ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసులో మరో రౌడీని పోలీసులు పట్టినంబాక్కంలో అరెస్టు చేశారు. ఈ హత్య కేసులో ఇప్పటిదాకా 25 మందిని అరెస్టు చేశారు. ఇక హత్యకు పాల్పడిన వారికి నాటు బాంబులు సరఫరా చేసిన కోడంబాక్కం పుదూరుకు చెందిన రౌడీ అప్పు అనుచరుడైన మాట్టు రాజా అనే రౌడీని అరెస్టు చేశారు. మాట్టురాజాపై పలు పోలీసుస్టేషన్లలో హత్యాయత్నం కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ బస్సు అపహరణ

పెరంబూర్, ఆగస్టు 31: నీలగిరి జిల్లా గూడలూరులో ప్రభుత్వ బస్సును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు కరియసోలై కొండలో శుక్రవారం రాత్రి బస్సును నిలిపిన డ్రైవర్, కండక్టర్ మరో ప్రాంతంలో నిద్రపోయారు. ఉదయం లేచి చూడగా బస్సు కనిపించకపోవడంతో దిగ్భ్రాంతి చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంతం నుంచి 3 కి.మీ దూరంలో నిలిచివున్న బస్సును గుర్తించిన పోలీసులు, బస్సు పక్కనే ఓ బైక్ ఉండడంతో, దాని ఆధారంగా బస్సును ఎత్తుకెళ్లిన వారి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

జాకెట్ బిట్ల చోరీ

● ఆంధ్ర మహిళల అరెస్ట్

ఐసిఎఫ్, ఆగస్టు 31: స్థానిక షావుకారుపేటలో జాకెట్ పీసులు చోరీ చేసిన ఇద్దరు ఆంధ్ర మహిళలను పోలీసులు అరెస్ట్ చేశారు. షావుకారుపేట మింట్ వీధికి చెందిన మహేంద్రన్ అదే ప్రాంతంలో జాకెట్ బిట్లు విక్రయించే దుకాణం నడుపుతున్నాడు. గురువారం సాయంత్రం దుకాణానికి వచ్చిన ఇద్దరు మహిళలు పలు డిజైన్లు చూసి ఒక్కటి కూడా కొనుగోలు చేయకుండా వెళ్లిపోయారు. అనుమానించిన మహేంద్రన్, జాకెట్ బిట్లను పరిశీలించగా ఓ బండిల్ జాకెట్ బిట్లు అదృశ్యమవడాన్ని గుర్తించాడు. వెంటనే దుకాణ ఉద్యోగులు పక్క వీధిలో నడిచివెళుతున్న ఆ ఇద్దరు మహిళలను పట్టుకొని రూ.15 వేలు విలువైన జాకెట్ బిట్ల బండిల్ స్వాధీనం చేసుకున్నారు. వారిని ఎలిఫెంట్ గేట్ పోలీసులు అరెస్ట్ చేసి విచారించగా, ఆంధ్రాకు చెందిన నల్లగుంట రామతులసి, పేరం సంతోషమ్మ అని తెలిసింది.

రూ.15 కోట్ల విలువైన సిగరెట్ల స్వాధీనం

ఐసిఎఫ్, ఆగస్టు 31: దుబాయ్, థాయ్‌ల్యాండ్ నుంచి నౌకలో తరలించిన రూ.15 కోట్ల విలువైన సిగరెట్లను కేంద్ర రెవెన్యూ దర్యాప్తు బృందం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గత నెల 8వ తేది థాయ్‌ల్యాండ్ నుంచి చెన్నై హార్బర్‌కు సరుకుల నౌక వచ్చింది. అందులో ఉన్న కంటైనర్లను అధికారులు తనిఖీ చేయగా, సిగరెట్ బండిళ్లు గుర్తించారు. రూ.10 కోట్ల విలువైన 67.17 లక్షల సిగరెట్లు స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్ నుంచి 14వ తేది వచ్చిన గూడ్సు నౌకలో రూ.5 కోట్ల విలువైన 30 లక్షల సిగరెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... సిగరెట్లపై తయారీ సంస్థ పేరు ఉండదని, వీటిలో అధిక మోతాదులో నికోటిన్, ఆర్సినిక్ వంటి రసాయన పదార్థాలుంటాయని తెలిపారు. ఈ సిగరెట్లు తాగడం వల్ల త్వరగా క్యాన్సర్‌కు గురయ్యే అవకాశాలున్నాయని, శ్వాసకోశ సంబంధమైన వ్యాధులు వస్తాయని తెలిపారు.

తెన్‌కాశిలో 144 సెక్షన్ అమలు

ప్యారీస్, ఆగస్టు 31: స్వాతంత్ర్య సమరయోధుడు బూలిదేవన్ జయంతిని పురస్కరించుకొని తెన్‌కాశిలో విధించిన 144 సెక్షన్ శనివారం నుంచి అమల్లోకి వచ్చింది. బూలిదేవన్ 309వ జయంతిని జరుపుకొనేందుకు దేవర్ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు, వివిధ సంఘాలు పలు ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నాయి. గతంలో జరుపుకున్న జయంతి వేడుకల్లో చోటుచేసుకున్న ఘర్షణలు దృష్టిలో ఉంచుకొని పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం నిబంధనలు కఠినతరం చేసింది. తెన్‌కాశి జిల్లా వాసుదేవనల్లూర్ సమీపంలో ఉన్న నెర్‌కట్టుంసేవల్‌లో ఉన్న బూలిదేవన్ స్మారక మండపం ప్రాంగణంలో ఉన్న ఆయన విగ్రహానికి రాష్ట్రప్రభుత్వం తరఫున అనుమతి పొందిన సంఘాలు నివాళులర్పించేందుకు జిల్లా యంత్రాంగం అనుమతులు జారీచేసింది. ఈ నేపథ్యంలో, జిల్లావ్యాప్తంగా శనివారం సాయంత్రం 6 నుంచి సెప్టెంబరు 2వ తేది ఉదయం 10 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఈ రోజుల్లో నలుగురు వ్యక్తుల కంటే ఎక్కువ మంది గుమిగూడితే చట్టపరమైన చర్యలుంటాయని కలెక్టర్ కమల్‌కిషోర్ హెచ్చరికలు జారీ చేశారు.



SUNDAY SPECIAL

పచ్చదనం.. పర్యావరణం

● వాటితోనే జీవన యానం

రసాయన ఎరువుల రాకతో ఆరోగ్యకరమైన ఆకుకూరలు, కూరగాయలు లభించడం అరుదుగా మారింది. కానీ, అందుకు భిన్నంగా సేంద్రియ వ్యవసాయంతో ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు తిరువళ్లూర్ జిల్లా రైతులు. నగరవాసులకు ఆరోగ్యకరమైన కూరగాయలు అందించడంలో ఎంతో సంతృప్తి ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చెన్నైలో నివాస స్థలమే లభ్యం కాని నేపథ్యంలో, పలువురు శివారు ప్రాంతాలపై దృష్టి సారించారు. ఫలితంగా ఎల్లప్పుడు పచ్చదనంతో కళకళలాడే గ్రామాలు ప్రస్తుతం కనుమరుగవుతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు పొలాలు కొనుగోలు చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారు. ఫలితంగా సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. అదే సమయంలో శివారు ప్రాంతాలకు కొంత దూరంగా ఉన్న గ్రామాల్లో సాగుపనులు చేస్తున్నా, అధిక దిగుబడుల కోసం రసాయనాలు, ఎరువులు వాడుతున్నారు. అలాంటి ఉత్పత్తులతో ప్రజలు అనారోగ్యం పాలయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.

- పెరంబూర్

తగ్గిన కొనుగోళ్లు...

పోషక విలువలు ఆకుకూరల్లో అధికంగా ఉంటాయనేది జగమెరిగిన సత్యం. అలాగే, సేంద్రియ ఎరువులతో పండించే కూరగాయల్లో కూడా పోషకాలు సంవృద్ధిగా ఉంటాయి. కాలక్రమేణా ప్రజల జీవన విధానంలో మార్పుల కారణంగా ఆకుకూరల వినియోగం బాగా తగ్గిపోయింది. ఆకుకూర తీసుకోవడం, వాటిని కొమ్మల నుంచి విభజించడం, నీటిలో శుభ్రం చేయడం, తాలింపు వేయడం, పప్పు చేసుకోవడం తదితరాలకు కొంత సమయం తీసుకుంటుంది. ప్రస్తుత యాంత్రిక జీవనంలో ప్రజలు వంటకాలు చేసేందుకు అంత సమయం వెచ్చించే పరిస్థితులు లేవు. ఉదయాన్నే లేవడం, హడావుడిగా చేతికి అందింది కొన్ని నిమిషాల్లో చేయడం, ఉద్యోగాలకు పోవడం యాంత్రికంగా జరిగిపోతోంది. దీంతో, పిల్లలకు పౌష్టికాహారం అందుతుందా లేదా అనే ఆలోచన కూడా తల్లిదండ్రుల్లో లేకపోయింది. పోషకాలు లేక చిన్నతనంలోనే పిల్లలు అనారోగ్యాలకు గురై ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో కొనుగోళ్లు తగ్గడంతో ఆకుకూరలు సాగు కూడా గణనీయంగా తగ్గిందనే చెప్పవచ్చు.



ప్రతి రోజూ 30టన్నులు...

ఈ నేపథ్యంలో, తిరువళ్లూరు జిల్లా రెడ్‌హిల్స్ సమీపంలోని లక్ష్మీపురం, పాత పన్నాతుకుళం, శరతకండిగై సహా చుట్టుపక్కల 9 గ్రామాల్లో సుమారు 500 మందికి పైగా రైతులు సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. వందలాది ఎకరాల్లో ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు. అలా సాగుచేసిన పంటను టి.నగర్, కోయంబేడు, అన్నానగర్ సహా పలు ప్రాంతాల్లోని మార్కెట్లకు తరలిస్తున్నారు. ప్రతిరోజూ సుమారు 30 టన్నుల కూరగాయలను వీరు చెన్నైవాసులకు అందిస్తున్నారు.

పారంపర్యంగా...

పెద్దల కాలం నుంచి సంక్రమించిన పారంపర్య వ్యవసాయాన్ని చేపడుతున్నామని రైతులు చెబుతున్నారు. కుటుంబ సభ్యులందరూ సాగు పనుల్లో పాల్గొంటున్నామని చెప్పారు. పిల్లలు పాఠశాలలు ముగించుకొని వచ్చిన తరువాత, సెలవు రోజుల్లో పొలం పనుల్లో సాయం చేస్తుంటారని తెలిపారు. తమ గ్రామాలు ఎల్లప్పుడూ పచ్చదనంతో ఉంటాయని తెలిపారు. ఈ వ్యవసాయంతో లాభాలు తక్కువగా ఉన్నా, ప్రజలకు ఆరోగ్యకరమైన కూరగాయలు, ఆకుకూరలు అందిస్తున్నామనే సంతృప్తి మిగులుతోందంటున్నారు. అన్నింటి కన్నా తమ వల్ల పచ్చదనం, పర్యావరణ బాగుపడుతుందని సంతోషంగా ఉందన్నారు.



ధనుష్ పంచాయితీకి త్వరలోనే ముగింపు!



చాలాకాలంగా సాగుతున్న హీరో ధనుష్ సినీ పంచాయితీకి త్వరలోనే తెరపడనుంది. తమిళ చిత్రపరిశ్రమలోని ప్రముఖ నిర్మాతకు, తనకు మధ్య తలెత్తిన సమస్యకు పరిష్కారానికి హీరో ధనుష్ ముందుకు వచ్చారు. ఈ నిర్ణయాన్ని చిత్రపరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు స్వాగతిస్తున్నారు. కోలీవుడ్ నిర్మాతల సంఘం అధ్యక్షుడిగా ఉన్న తేనాండాళ్ పిక్చర్స్ అధినేత రామస్వామి ఎన్ మురళి నిర్మాతగా ధనుష్ హీరోగా ఒక చిత్రం కొన్నేళ్ల క్రితం ప్రారంభమైంది. కొద్దిగా షూట్ చేసిన తర్వాత ఆ ప్రాజెక్టు అటకెక్కింది. ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదు. దీంతో ఆర్థికంగా నష్టపోయిన నిర్మాత మురళి.. నిర్మాతల మండలిలో ఫిర్యాదు చేశారు. ఇటీవల సమావేశమైన నిర్మాతల మండలి.. నిర్మాతల నుంచి అడ్వాన్సులు తీసుకుని డేట్స్ ఇవ్వని హీరోలపై చర్యలు (రెడ్‌కార్డ్) తీసుకునేలా తీర్మానం చేసింది. ఇలాంటివారిలో హీరో ధనుష్ కూడా ఉన్నారు. ఈ వ్యవహారం చర్చకు వచ్చినపుడల్లా ధనుష్ పేరు తెరపైకి వస్తుంది. దీంతో ఈ సమస్య పరిష్కారానికి ధనుష్.. తేనాండాల్ పిక్చర్స్ ప్రతినిధులతో చర్చించినట్టు సమాచారం. అయితే, తొలుత అనుకున్న కథను కాకుండా, మరో కొత్త కథతో సినిమా తీస్తే తాను నటించేందుకు సిద్ధమని ధనుష్ హామీ ఇచ్చినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఈ చర్చలు ఫలిస్తే, ధనుష్ - నిర్మాత మురళి మధ్య వివాదానికి శుభంకార్డు పడినట్టే.

చిత్రజ్యోతి



'కూలీ'లో ప్రీతి పాత్రలో శృతిహాసన్

సూపర్‌స్టార్ రజనీకాంత్ చిత్రంలో విశ్వనటుడు కమలహాసన్ కుమార్తె, హీరోయిన్ శ్రుతిహాసన్ నటిస్తున్నారు. దర్శకుడు లోకేష్ కనకరాజ్, రజనీ కాంబినేషన్‌లో 'కూలీ' చిత్రం రూపొందుతోంది. ఇందులో శ్రుతిహాసన్ 'ప్రీతి' పాత్రలో నటిస్తున్నారు. ఈ విషయాన్ని చిత్ర బృందం తాజాగా ఓ పోస్టర్ ద్వారా అధికారికంగా వెల్లడించింది. కాగా, ఈ చిత్రంలో నటించే నటీనటుల వివరాలను దర్శకుడు లోకేష్ తన ఎక్స్ ఖాతాలో బహిర్గతం చేస్తున్న విషయం తెల్సిందే. ఇందులోభాగంగా తొలుత మలయాళ నటుడు సౌబిన్ జాహిర్ పేరును వెల్లడించగా, గురువారం టాలీవుడ్ అగ్రహీరో అక్కినేని నాగార్జున ఈ సినిమాలో సైమన్ పాత్రలో నటించనున్నట్టు పేర్కొన్నారు. ఇపుడు శ్రుతిహాసన్ పోషించే పాత్ర పేరుతో పాటు ఆమె స్టిల్‌ను విడుదల చేశారు. కాగా, ఇటీవల శ్రుతిహాసన్ రూపొందించిన మ్యూజిక్ ఆల్బంలో లోకేష్ కనకరాజ్ నటించిన విషయం తెల్సిందే. ఇందులో వీరిద్దరు సన్నిహితంగా నటించడం చర్చనీయాంశమైంది. 'కూలీ'ని నిర్మాత కళానిధి మారన్ నిర్మిస్తుండగా, అనిరుధ్ సంగీతం సమకూర్చుతున్నారు.


జీవా - ప్రియా భవానీ జంటగా 'బ్లాక్'

జీవా, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన చిత్రం 'బ్లాక్'. 'మాయా', 'మానగరం', 'మాన్‌స్టర్', 'టానాక్కారన్' వంటి హిట్ చిత్రాల రూపకర్త పొటెన్షియల్ స్టూడియో నిర్మించింది. కేజీ బాలసుబ్రమణి దర్శకత్వం వహించగా, గోకుల్ బినాయ్ ఛాయాగ్రహణం అందించారు. శామ్ సీఎస్ సంగీతం. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ... 'ఒకే రోజు రాత్రి జరిగే సంఘటనలతో తెరకెక్కించాం. ఇందులో రెండు పాత్రలు మాత్రమే కీలకం. థ్రిల్లర్ అనుభూతిని కలిగించే ఈ సినిమా చిత్రీకరణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. మన చుట్టూ అలముకునివున్న చీకటిని 'బ్లాక్' అంటాం. మన చీకటి కోణాన్ని ఇతరులెవ్వరూ అంత సులభంగా అర్థం చేసుకోలేనంతగా, గుర్తుపట్టనంత వరకు అంతా సాఫీగానే సాగిపోతుంది. దాన్నే ఒక వ్యక్తిలోని చీకటి కోణం అంటారు. ఇదే బ్లాక్ కథ' అని పేర్కొన్నారు.


ప్రియా భవానీ శంకర్

టొవినో థామస్ 50వ చిత్రం 'ఏఆర్‌ఎం'

'మిన్నల్ మురళి' ఫేం టొవినో థామస్ నటిస్తున్న 50వ చిత్రం 'ఏఆర్‌ఎం'. పూర్తి యాక్షన్ భరిత జోనర్‌లో పాన్ ఇండియా మూవీగా తమిళం, తెలుగు తదితర భాషల్లో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను తాజాగా రిలీజ్ చేయగా, మంచి స్పందన వచ్చింది. 'మిన్నల్ మురళి', 2018 - ఎవ్రీ వన్ ఈస్ ఏ హీరో' వంటి చిత్రాలతో దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిన టొవినో థామస్... తన తదుపరి సినిమాను ఫుల్ యాక్షన్ ప్యాక్ట్ మూవీగా రూపొందిస్తున్నారు. మ్యూజిక్ ఫ్రేమ్స్, యూజీఎం మోషన్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మించే ఈ చిత్రానికి నూతన దర్శకుడు జితిన్ లాల్ దర్శకత్వం వహిస్తున్నారు. పూర్తిగా త్రీడీ ఫార్మెట్‌లో రూపొందించే ఈ చిత్రాన్ని డాక్టర్ జకారియా థామస్‌తో కలిసి లిస్టిన్ స్టీఫెన్ నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టుపై అనౌన్స్‌మెంట్ వచ్చినప్పటికీ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమాకు సంబంధించిన ఒక్కో అప్‌డేట్స్‌పై అంచనాలు పెంచుతున్నాయి. తాజాగా రిలీజ్ చేసిన ట్రైలర్ కూడా సినిమాపై అంచనాలను మరింతగా పెంచేసింది. మొత్తం 2 నిమిషాల 33 సెకన్ల ట్రైలర్‌లో 1900, 1950, 1990 మధ్యకాలంలో ఉత్తర కేరళ రాష్ట్రంలోనే జరిగే కథను వివరిస్తూ సాగుతుంది.

'ఏఆర్‌ఎం'లో టొవినో థామస్



చిత్తూరు - తిరుత్తణి మధ్య పాలారు నదిపై నిర్మించిన వంతెన ప్రారంభిస్తున్న మంత్రి దురైమురుగన్

'కాట్పాడి అంటే ప్రాణాలు వదులుతాను'

●మంత్రి దురైమురుగన్ ఉద్వేగం

వేలూరు, ఆగస్టు 31: 'కాట్పాడి అంటే ప్రాణాలు వదులుతాను' అని మంత్రి దురైమురుగన్ ఉద్వేగంగా అన్నారు. కాట్పాడి సమీపంలోని పాలారు నదిపై చిత్తూరు - తిరుత్తణి జాతీయ రహదారిపై రూ.35 కోట్లతో నిర్మించిన వంతెనను శుక్రవారం సాయంత్రం మంత్రి దురైమురుగన్ ప్రారంభించారు. కార్యక్రమానికి ప్రజా పనుల శాఖ మంత్రి ఏవీ వేలు అధ్యక్షత వహించగా, చేనేత శాఖ మంత్రి గాంధీ ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి దురైమురుగన్ మాట్లాడుతూ... ఆంగ్లేయులు, అనంతరం కాంగ్రెస్ పాలనలో కూడా పాలారుపై వంతెన నిర్మించలేదన్నారు. 1973లో తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం పనులు ప్రారంభించి 1975లో వంతెనపై రాకపోకలు ప్రారంభించామన్నారు. ఇటీవల ఈ వంతెన కూలడంతో రూ.35 కోట్లతో కొత్త వంతెన నిర్మించామని తెలిపారు. 100 ఏళ్ల తర్వాత కూడా కాట్పాడి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని తను పేరు చెప్పుకొనేలా చర్యలు చేపట్టానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఎంపీలు జగద్రక్షకన్, కదిర్ ఆనంద్, ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, అమ్ములు విజయన్, ఈశ్వరప్పన్, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చూలై తెలుగు బాప్టిస్టు చర్చి డైమండ్ జూబ్లీ వేడుకలు

ప్యారీస్, ఆగస్టు 31: స్థానిక చూలైలోని తెలుగు బాప్టిస్టు చర్చి డైమండ్ జూబ్లీ వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా జరిగాయి. డౌటన్ రిథ్రడన్ రోడ్డులోని వైఎంసీఏ హాలులో సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ఎం.పాల్‌ఈశ్వరప్ప ప్రార్థనతో ప్రారంభమైన ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా రాష్ట్ర మైనార్టీ కమిషన్ మాజీ ఛైర్మన్ పీటర్ అల్ఫోన్స్, ప్రత్యేక అతిథులుగా హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ఐజక్, తిరుపతికి చెందిన జి.డేవిడ్ కరుణాకర్ పాల్గొని సీటీబీసీ నిర్వాహకుల సేవలను ప్రశంసించారు. వార్షిక నివేదికను కార్యదర్శి ఎలకపాటి ముత్తుకుమార్ చదివి వినిపించారు. అసిస్టెంట్ పాస్టర్ రెవరెండ్ వి.జేసుదాస్ సంఘం తరఫున చేపడుతున్న ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు వివరించారు. ఈ వేడుకల్లో ఛైర్మన్ వై.విజయకుమార్, ట్రెజరర్ వైడీ భాస్కరరావు, జి.సురేష్‌కుమార్, ఎండీ వీర్రాజు, ఎ.లాబాను, కే.ఏ.జయపాల్, పి.ప్రభుదాస్, కమిటీ సభ్యులు, స్త్రీల సమాజం, యువజన విభాగం, సండే స్కూలు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.



రాష్ట్ర మైనార్టీ కమిషన్ మాజీ ఛైర్మన్ పీటర్ అల్ఫోన్స్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

అమెరికాలోని ఆలయానికి కాంచీపురంలో తయారైన బంగారు రథం



పెరంబూర్, ఆగస్టు 31: కాంచీపురంలో రూ.1.25 కోట్ల రూపొందించిన బంగారం పూత పూసిన 4 టన్నుల రథం శనివారం అమెరికాలోని వాషింగ్టన్‌కు బయల్దేరింది. వాషింగ్టన్ రాష్ట్రం సియాటిల్‌లో వేద ఆలయ నిర్మాణం జరుగుతోంది. ఈ ఆలయానికి బంగారు పూత పూసిన రథాన్ని కాంచీపురంలో తయారు చేయించాలని ఆలయ నిర్వాహకులు నిర్ణయించారు. ఆ ప్రకారం, ఇనుము, రాగిని ఉపయోగించి 23 అడుగుల ఎత్తు, 4 టన్నుల బరువుతో బంగారు పూతతో కూడిన రథాన్ని తయారుచేశారు. 35 డిగ్రీలతో తిరిగే అవకాశముండేలా రూపొందించిన ఈ రథం తయారీకి 75 రోజులు పట్టింది. ఏ ప్రాంతానికైనా ఈ రథం తీసుకెళ్లేలా 6 భాగాలుగా విభజించారు. శివుడు, విష్ణువు సహా ఏ దేవుడికైనా రథం వినియోగించేలా అలంకరణలో బొమ్మలు ఏర్పాటయ్యాయి. ఈ రథాన్ని శనివారం ఆలయ నిర్వాహకులకు అప్పగించగా, వారు దాన్ని అమెరికా తీసుకెళ్లనున్నారు.

కుట్రాలం జలపాతాల్లో స్నానాలపై నిషేధం


కుట్రాలం ప్రధాన జలపాతం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న జలాలు

చెన్నై, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి, తెన్‌కాశి జిల్లాల్లో పడమటి కనుమలలో శుక్రవారం కుండపోత వర్షాలు కురవడంతో కుట్రాలం జలపాతాల వద్ద నీరు ఉధృతంగా పడుతోంది. దీంతో ఆ జలపాతాల వద్ద పర్యాటకులు స్నానం చేయకుండా అధికారులు నిషేధించారు. తిరునల్వేలి జిల్లాలోని సేర్వలారు, పాపనాశం జలాశయాల నీటి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ఆ జలాశయాల్లోకి వస్తున్న నీటి పరిమాణం క్రమంగా పెరుగుతూ వస్తోంది. సెకనుకు 1102 ఘనపుటడుగుల చొప్పున డ్యాంలోకి జలాలు ప్రవేశిస్తున్నాయి. సేర్వలారు డ్యాంలో శుక్రవారం వరకూ నీటిమట్టం 114 అడుగులుగా ఉండేది. శనివారం ఉదయం రెండు అడుగులకు పెరిగి 116.89కు చేరింది.

రక్త, నేత్ర, అవయవదాన శిబిరాలకు అపూర్వ స్పందన


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న జ్ఞానశక్త్యేంద్ర స్వామి

చెన్నై, ఆగస్టు 31 (ఆంధ్ర జ్యోతి): స్థానిక పెరంబూరులోని వివేకానంద విద్యాలయ స్కూలు ప్రాంగణంలో శనివారం ఉదయం నిర్వహించిన రక్త, నేత్ర, అవయవదానాల శిబిరాలకు అపూర్వ స్పందన లభించింది. ఎస్కేఎన్‌ఎస్ పీఎంసీ వివేకానంద విద్యాలయం, ఆర్‌ఎస్‌ఎస్, హెచ్‌ఎస్‌ఎస్ - బ్యూరో, ఆవలూరులోని ఓం ఆదిశక్త్యేంద్ర ట్రస్టు, జనకల్యాణ్ చెన్నై జిల్లా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ శిబిరాలను శ్రీ ఓం ఆదిశక్త్యేంద్ర ట్రస్టు అధినేత జ్ఞానశక్త్యేంద్ర స్వామి, మాదా మెడికల్ కాలేజీ డీన్ ఎస్‌ఆర్ రవీంద్రన్, జనకల్యాణ్ సుబ్రమణియం ప్రారంభించారు. ఈ శిబిరంలో 63 మంది రక్తదానం చేశారు. 21 మంది నేత్రదానం చేయడానికి, 25 మంది అవయవదానం చేయడానికి అంగీకార పత్రాలు అందజేశారు. ఈ శిబిరంలో 138 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో ఐదుగురికి క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు కరస్పాండెంట్ కేఈ శ్రీనివాసన్, ప్రిన్సిపాల్ కే.శుభశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానం సర్వరోగ నివారిణి

● మెడిటేషన్ కోచ్ బాలాజి దొంతి

ప్యారీస్, ఆగస్టు 31: ధ్యానం సర్వరోగ నివారిణి అని, ప్రతిరోజు క్రమం తప్పకుండా ధ్యానం చేస్తే ఆరోగ్యం, ఆనందం కలుగుతుందని మెడిటేషన్ కోచ్ బాలాజి దొంతి పేర్కొన్నారు. తిరువాన్మియూర్‌లో శనివారం చెన్నై పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ (పీఎస్‌ఎస్‌ఎం), ఈశ్వర పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ సహకారంతో ఏర్పాటు చేసిన సంగీత ధ్యాన్య యజ్ఞంలో సుమారు 400 మందికి పైగా పాల్గొన్నారు. పీఎస్‌ఎస్‌ఎం వ్యవస్థాపకుడు పత్రీజీ కరోనా లాక్‌డౌన్ సమయంలో దేశప్రజలకు ఆరోగ్యం పట్ల బోధించిన సూచనలు, వెజిటేరియనిజం, ధ్యానం వల్ల కలిగే లాభాలు వంటి ప్రసంగాలతో తమిళం, ఆంగ్లంలో ముద్రించిన పుస్తకాలను ఈ కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలాజి మాట్లాడుతూ... వాయుకాలుష్యం, శబ్దకాలుష్యం విపరీతంగా పెరుగుతున్న ఈ రోజుల్లో సగటు మనిషి ఆరోగ్యం ప్రశ్నార్థకమైందన్నారు. మానసిక చికాకు, ఒత్తిడి నుంచి వెంటనే బయటపడాలంటే ఏకైన మార్గం ధ్యానమేనని సూచించారు. ఈ కార్యక్రమంలో ధ్యాన మాస్టర్లు అమరా చంద్రశేఖర్, ప్రశాంత దుంపటలు, గుండా సునీత జగదీష్, కోటీశ్వరన్ తదితరులు పాల్గొన్నారు. ఉచిత ధ్యానం తరగతుల్లో పాల్గొనేవారు సెం.9840075156లో సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.


పత్రీజీ రచించిన పుస్తకాలు ఆవిష్కరిస్తున్న బాలాజి, చంద్రశేఖర్, కోటీశ్వరన్ తదితరులు